



పెద్దన్న మృతదేహం వద్ద నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి, తదితరులు

ఉద్యమాల 'పెద్దన్న' ఇకలేరు...

పలువురి సంతాపం

ప్రజాశక్తి-అనంతపురం



పెద్దన్న

ఉద్యమాల 'పెద్దన్న'గా పేరొందిన సిపిఐ ఎంఎల్ నాయకులు పెద్దన్న(76) ఆదివారం తెల్లవారుజామున గుండెపోటుతో మృతి చెందారు. ఆయన మృతికి పలువురు సంతాపం తెలిపారు. 1948 ఆగస్టు ఎనిమిదవ తేదీన యల్లనూరు మండలం చింతకాయమంద గ్రామంలో నాగమ్మ, పక్కీరప్ప దంపతులకు జన్మించారు. ఆయనతో పాటు ఇద్దరు అక్కలు, ఒక చెల్లులు ఉన్నారు. అక్క బిడ్డ వరలక్ష్మిని వివాహం చేసుకున్న ఈయన డిగ్రీ వరకు చదివి వ్యవసాయ శాఖలో ఉద్యోగిగా చేరారు. 1998లో ఉద్యోగానికి రాజీనామా చేసి కమ్యూనిస్టు పార్టీలో చేరారు. తరిమెల నాగిరెడ్డి ప్రభావంతో విద్యార్థి దశ నుంచి ఉద్యమాల్లో ఉంటూ వచ్చారు. ప్రగతిశీల విద్యార్థి సంఘంలో పనిచేస్తూ యుసిసిఆర్ఐ (ఎంఎల్) పార్టీలో చేరారు. ఈ ఉద్యమాల్లో ఉంటూనే ఎన్జీవో సంఘం నాయకుడు గానూ పనిచేశారు. అనంతరం ఆ పార్టీ సిపిఐ ఎంఎల్‌గా రూపొంతరం చెందింది. స్వచ్ఛంద ఉద్యోగ విరమణ తరువాత సిపిఐ ఎంఎల్ జిల్లా కార్యదర్శిగానూ, రాష్ట్ర నాయకులుగానూ పనిచేస్తూ వచ్చారు. తుదిశ్వాస వరకు కూడా వామపక్ష పార్టీలోనే ఎర్రజెండా పట్టుకుని నడిచారు. గత కొంత కాలంగా వయోభారంతో అనేక ఆరోగ్య సమస్యలతో ఇబ్బందులు పడుతూ ఉన్నా వామపక్ష ఉద్యమాల్లో పాల్గొంటూనే వచ్చారు. ప్రస్తుతం జరుగుతున్న అంగన్‌వాడీ కార్మికుల సమ్మెలోనూ పాల్గొని మద్దతు తెలిపారు. వామపక్ష ఐక్య ఉద్యమాల్లోనూ ఆయన అగ్రభాగాన ఉంటూ ప్రజా సమస్యల కోసం పోరాడుతూ వచ్చారు. ఈనేపథ్యంతో పెద్దన్న ఆదివారం తెల్లవారుజామున గుండెపోటుతో మృతి చెందారు. ఆయన భౌతికకాయాన్ని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.రాంభూపాల్, రాష్ట్ర నాయకులు జి.ఓబులు, సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసి నాయకులు ఇండ్ల ప్రభాకర్‌రెడ్డి, మానవ హక్కుల వేదిక నాయకులు ఎస్ఎం.బాషా, అనంతపురం ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి తదితరులు సందర్శించి నివాళులు అర్పించారు.

వామపక్ష ఐక్య ఉద్యమాలకు తీరని లోటు : వి.రాంభూపాల్ సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు

సిపిఎం ఎంఎల్ రాష్ట్ర నాయకులు పెదన్న మృతి వామపక్ష ఐక్య ఉద్యమానికి జిల్లాలో తీరని లోటు అని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.రాంభూపాల్ విచారం వ్యక్తం చేశారు. జిల్లా కమ్యూనిస్టు ఉద్యమానికి పెద్ద దిక్కుగా ఉంటూ ఎవరి తప్పునైనా నిక్కచ్చిగా అంతర్గత సమావేశాల్లో ఎత్తి చూపేవారని తెలిపారు. అంతేకాకుండా ప్రజాసమస్యలపై ఏ కమ్యూనిస్టు పార్టీ పోరాడినా మనస్ఫూర్తిగా స్వాగతిస్తూ, తగిన సలహాలు, సూచనలిచ్చేవారని గుర్తు చేశారు.



కన్పించని సంక్రాంతి

పల్లె పండుగగా పిలుచుకునే సంక్రాంతి పండుగలో క్రాంతి (వెలుగులు)లేవీ కనిపించడం లేదు. సర్వత్రా నిరాశ, నిస్పృహలు అలుముకున్నాయి. 2023లో వర్షాభావంతో రైతులు పంటలు పూర్తి స్థాయిలో సాగు చేయలేకపోయారు. పెట్టిన పంటలు కూడా పూర్తి స్థాయిలో చేతికిరాకపోవడంతో తీవ్రమైన నిరాశతోనున్నారు. చేతిలో చిల్లిగవ్వ ఆడక సంక్రాంతి పండుగ సందడి పల్లెల్లో కనిపించడం లేదు. మరోవైపు పట్టణాల్లోనూ ఇంచుమించు అదే పరిస్థితి నెలకొంది.

పల్లె పండుగలో కనిపించని సందడి

రైతులు, కార్మికులు, ఉద్యోగుల్లోనూ నిరాశే

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

2023 జూన్ ఖరీఫ్ ప్రారంభం నుంచి వర్షాభావ పరిస్థితులు జిల్లాలో నెలకొన్నాయి. పంటల సాగే 60 శాతం వరకే అయింది. వేసిన పంట కూడా చేతికందలేదు. ప్రభుత్వం కరువు మండలాలు ప్రకటించింది. కాని ఇప్పటి వరకు పంటనష్ట పరిహారం ఇవ్వలేదు. గతంలో ఎన్నడూలేని విధంగా ఈసారి ఆయకట్టు రైతుల్లోనూ ఆందోళన నెలకొంది.సాగునీరు అందక వేసిన పంటలను కాపాడుకోవడానికి అనేక రకాలుగా ఇబ్బందులు, కష్టాలు పడుతున్నారు. నీటిని సుదూర ప్రాంతాల నుంచి ట్యాంకర్ల ద్వారా తెచ్చుకుని పంటను కాపాడుకునే పనిలోనున్నారు. దీంతో రైతు చేతిలో చిల్లిగవ్వలేక పండుగను ఉన్న కాడికి జరుపుకునే పరిస్థితులు నెలకొన్నాయి.

ఉద్యోగులు, కార్మికులకు తప్పని కష్టాలు

ఉద్యోగులు, కార్మికులకు కష్టాలు తప్పడం లేదు. ప్రధానంగా వివిధ విభాగాల్లో పనిచేస్తున్న కార్మికులు సమ్మెలోనున్నారు. అంగన్‌వాడీ, మున్సిపల్, సర్వశిక్షా అభియాన్ ఉద్యోగులు ఇలా అందరూ తమ సమస్యలపై పోరాటాలు సాగించారు. ప్రభుత్వం వారి సమస్యల పరిష్కారానికి ముందుకు రావడం లేదు. సమ్మెలో ఉండటంతో వారికి వేతనాలు అందని పరిస్థితులు నెలకొన్నాయి. అంగన్‌వాడీ కార్మికులు భోగి పండుగ రోజు కూడా సమ్మెలో ఉండి ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకిస్తూ భోగి మంటలు వేసి నిరసన తెలిపారు. దీంతో ఆ కుటుంబాల్లోనూ సంక్రాంతి పండుగ శోభ కనిపించడం లేదు.

పెరిగిన ధరలు

పెరిగిన నిత్యావసర ధరలతో పండుగకు పిండి వంటలు చేసుకోవాలంటే కూడా భయపడి పోయే పరిస్థితి నెలకొంది. ప్రధానంగా సన్న బియ్యం ధర కిలో రూ.55 నుంచి రూ.60వరకు ఉంది. పేదలు రేషన్ బియ్యంతోనైనా సరిపెట్టుకునే పరిస్థితి ఉండగా మధ్యతరగతి వారికి మాత్రం బియ్యం ధరలు కూడా భారమవుతున్నాయి. ఇక శనగపిండి, నూనె, చక్కెర, బెల్లం తదితర నిత్యావసర ధరలు బాగా పెరగడంతో పిండి వంటలు చేసుకోవడానికి కూడా వెనుకాడే పరిస్థితులు నెలకొన్నాయి. ఎప్పుడూ పండుగ సమయాల్లో కళకళలాడే కిరాణా దుకాణాలు, బట్టల వ్యాపారాలు కూడా ఈసారి వెలవెలబోయి కనిపించాయి.

పండుగ పూట.. ధరల మంట..!

ప్రజాశక్తి-హిందూపురం

నిత్యావసర వస్తువుల ధరలు జనానికి చుక్కలు చూపెడుతున్నాయి. తెలుగువారి పెద్ద పండుగ సంక్రాంతి వేళ అందరికీ ఇష్టమైన పిండివంటలకు కష్టాలొచ్చాయి. నూనె ధరలు సలసలకాగుతున్నాయి. కేజీ పామాయిల్ ధర రూ.100కి పైగా ఉందంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. ఇక పప్పులు పేలుతున్నాయి. బియ్యం, ఇతర సరుకులూ వాటికి పోటీపడుతున్నాయి. కరోనా కాలంలో కొండెక్కిన ధరలు ఎంతకీ తగ్గకపోగా పండుగ సమయంలో ఆకాశాన్నంటాయి. ఇంత జరుగుతున్నా ధరల నియంత్రణ అనేది మచ్చుకు కూడా కని పించడం లేదు. దీంతో వ్యాపారుల ఇష్టారాజ్యమైందన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఫలితంగా సామాన్యుల పండుగ పూట సైతం ఆనందం ఆవిరవుతోంది. పేదలైతే పిండివంటలు మర్చిపోవాల్సి వస్తోంది. వందలు కాదు వేల రూపాయలు ఉంటేనే సరుకులు అన్నట్లు పరిస్థితి తయారైంది.

దడ పుట్టిస్తున్న నిత్యావసర ధరలు

సామాన్యులకు నిత్యావసర ధరలు దడ పుట్టిస్తుండగా, కూరగాయల ధరలు కొండెక్కి కూర్చున్నాయి. నెల వ్యవధిలోనే అన్ని రకాల సరుకులు కేజీకి ఏకంగా రూ.10 నుంచి 20వరకూ పెరిగాయి. పండుగకు అందరికీ తప్పనిసరి వంటకమైన అరిసెలకు వంట నూనెల ఎఫెక్ట్ తగిలింది. ఊహించని విధంగా కిలో రూ.130పైనే ఉండటంతో ఆవైపు చూసేందుకే భయపడుతున్నారు. కనీసం పప్పులతో సరిపెట్టుకుందామనుకుంటే పెరిగిన ధరలతో ఏంకొనేటట్లు లేదు. దీంతో సామాన్యులు చాలావరకు ఒకటి, అర వంటకాలతో సరిపెట్టుకుంటున్నారు. ఇక పోతే అందరికి అందుబాటులో ఉండాల్సిన బియ్యం ధరలు బ్యాళ్ల ధరతో పోటీ పడుతున్నాయి. ఏకంగా ఒక క్వింటోలు బియ్యంపై ఒక్క సారిగా రూ.600 వరకు పెరిగింది. ఇక బ్యాళ్ల ధర అయితే రూ.160 దాటింది. ఉల్లి ధర మళ్లీ పెరుగుతోంది. తెల్లవాయిలు అయితే రూ.320 ఉంది. నిత్యం తక్కువకు దొరికే టమోటో రూ.20 ఉంది. ఇలా ప్రతి వస్తువు అమాంతంగా పెరుగుతుంటే సామాన్యులు పండుగలను ఎలా చేయాలో అని తలలు పట్టుకుంటున్నారు.

రెడీమేడ్ వంటకాల వైపు మొగ్గు

ఆకాశాన్నంటుతున్న ధరలతో దుకాణాల్లో సరుకులు కొని తీసుకెళ్లి వంటకాలు తయారుచేయడం పట్టణాల్లో దాదాపు తగ్గిపోయింది. దానికితోడు కుప్పలుతెప్పలుగా వెలుస్తున్న రెడీమేడ్ వంటకాల వైపు మొగ్గు మధ్య తరగతి వారు మొగ్గు చూపుతున్నారు. అయితే అక్కడ సైతం పిండివంటల ధరలు మండిపోతున్నాయి. అదేమంటే ధరలు పెరిగాయనివారూ చెప్తున్నారు. దీంతో తప్పనిసరి పరిస్థితుల్లో పట్టణవాసులు అవసరమైన తినుబండారాల కొనుగోలుకు వెళుతుండడంతో ఆ దుకాణాలు కళకళలాడుతున్నాయి. ముఖ్యంగా మధ్యతరగతి వారే రెడీమేడ్ వంటకాలపై మక్కువ చూపుతున్నట్లు వ్యాపారులు చెబుతున్నారు. ముఖ్యంగా సంక్రాంతి పండుగ కావడంతో కాలనుగుణంగా ఖర్చును సైతం లెక్కచేయకుండా పెద్ద కుటుంబాల వారు మాత్రమే వంటల ఘుమఘుమను కొనసాగిస్తున్నారు.

లేపాక్షికి యునెస్కో గుర్తింపు లభించేనా..?

ప్రజాశక్తి-హిందూపురం

ఈ నెల 16న మంగళవారం జిల్లాకు వస్తున్న దేశ ప్రధాని నరేంద్ర మోదీ ప్రముఖ పర్యాటక కేంద్రం లేపాక్షిని సందర్శించనున్నారు. స్వయాన ప్రధానమంత్రి లేపాక్షి విశిష్టతను తెలుసుకొని పర్యటించాలని నిర్ణయం తీసుకోవడం వెనుక ఆలోచన ఏమి అన్నది అర్థం కావడం లేదు. ముఖ్యంగా వచ్చేనెల 22వ తేదీన అయోధ్యలో శ్రీరామ మందిరం అంగరంగ వైభవంగా ప్రారంభించేందుకు బిజెపి నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. నూతనంగా అత్యంత సుందరంగా నిర్మించిన అయోధ్య శ్రీరామ మందిరం ప్రారంభోత్సవాన్ని కూడా ప్రధాని నరేంద్ర మోదీ అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. రామాయణం ఇతిహాసంలో సీతాదేవిని రావణాసురుడు ఎత్తుకెళుతున్న సందర్భంలో లేపాక్షి వద్ద జటాయువు అడ్డు తగిలి నిలువరించేందుకు ప్రయత్నించిందని చరిత్ర చెబుతోంది. దీంతో ఆగ్రహావేశాలకు గురైన రావణాసురుడు ఆ జటాయువును తన ఖడ్గంతో చీల్చడంతో ప్రాణాపాయ స్థితిలో నేలకొరిగినట్లు చరిత్ర ఉంది. తదనంతరం సీతమ్మ జాడ కోసం అటుగా వస్తున్న శ్రీరాముడు జటాయువును చూసి ఏమి జరిగిందంటూ అడగగా జరిగిన విషయాన్ని చెప్పడం... ప్రాణాపాయ స్థితిలో ఉన్న జటాయును ఉద్దేశించి లే.....పక్షి అంటూ ఆశీర్వాదం చేయడంతో మళ్లీ ఆ జటాయువు ప్రాణవాయువు పొందినట్లు చరిత్రకారులు చెబుతున్నారు. లేపాక్షి చరిత్ర తెలుసుకున్న ప్రధాని మోదీ ఆలయాన్ని సందర్శించాలని నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఇందులో భాగంగా అధికార యంత్రాంగం ప్రధాని పర్యటనకు అవసరమైన చర్యలు చేపడుతోంది. జిల్లా కలెక్టర్, ఎస్పీ, ప్రధాని ప్రత్యేక సెక్యూరిటీ బృందం, ఉన్నతాధికారులు ఆదివారం లేపాక్షి కి వచ్చి ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్నారు. అయితే ఎప్పటి నుంచో లేపాక్షి ఆలయం యునెస్కో గుర్తింపు కోసం పోటీలో ఉంది. ప్రధాని పర్యటనతోనైనా లేపాక్షికి యునెస్కో గుర్తింపు లభించడంతో పాటు లేపాక్షికి మహర్దశ పడుతుందా అని చరిత్రకారులు ఆశిస్తున్నారు.



లేపాక్షి ఆలయంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్, జిల్లా అధికారులు

అంగన్వాడీల ఆకలికేకలతో

రగిలిన భోగి మంటలు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

అంగన్వాడీల ఆకలి కేకలతో జిల్లావ్యాప్తంగా ఆదివారం భోగి మంటలు రగిలాయి. సంక్రాంతి పండుగను పురస్కరించుకుని ప్రభుత్వం అంగన్వాడీలపై ప్రయోగించిన ఎస్మా ప్రతులను ఆదివారం భోగి మంటల్లో దహనం చేసి నిరసన తెలిపారు. ఇందులో భాగంగా అనంతపురం సమ్మె శిబిరం వద్ద తమ డిమాండ్లను చూపుతూ సంక్రాంతి ముగ్గులు వేశారు. ఈ ముగ్గులు చూపరులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా ఎపి అంగన్వాడీ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు ఎస్.నాగేంద్రకుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి రమాదేవి ఇప్పటి వరకూ ప్రభుత్వంతో ఆరుసార్లు చర్చలు జరిగినా జిల్లాకు చెందిన స్త్రీ శిశు సంక్షేమశాఖ మంత్రి ఉషశ్రీచరణ్ ఒకసారి మాత్రమే పాల్గొనడం బాధాకరమన్నారు. స్వయానా సిఎం జగన్ ఇచ్చిన హామీలను అమలు చేయమని అడిగితే ఎస్మా ప్రయోగించడం ఎంత వరకూ సమంజమని ప్రశ్నించారు. వేతనాలు పెంచేంత వరకూ సమ్మె విరమించే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎపి అంగన్వాడీ వర్కర్స్ యూనియన్, జిల్లా ప్రధాన కార్యదర్శి, కోశాధికారి రమాదేవి, జమున, అరుణ, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు కె.నాగభూషణం, సిపిఎం నగర కార్యదర్శి ఆర్వి.నాయుడు, రూరల్ నాయకురాలు మహబీ, ఆరీఫా, వరలక్ష్మి, రామాంజనమ్మ, నారాయణమ్మ, మహబూబ్‌బీ, అనసూయ, సలోమియా, భాగ్య, నారాయణమ్మ, శ్యామల, ఎన్.వీనా, సూర్యకళ, మాధవి, తదితరులు పాల్గొన్నారు.

పెద్దవడుగూరు : అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఆదివారం మండలంలోని పలు గ్రామాల్లో 'జగనన్నకు చెబుదాం' కోటి సంతకాల సేకరణ చేపట్టారు. ఈసందర్భంగా గ్రామాల్లోని ప్రజలతో సంతకాలు సేకరించారు. సేకరించిన సంతకాలను జగనన్నకు పంపనున్నట్లు యానియన్ నాయకురాళ్లు తెలిపారు.

భోగి మంటల్లో ఎస్మా ప్రతులు దహనం

వేతనాలు పెంచేంత వరకూ సమ్మె

అంగన్వాడీ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు నాగేంద్రకుమార్



పెద్దవడుగూరులో సంతకాలు సేకరిస్తున్న అంగన్వాడీలు

కోడిపందేలపై ప్రత్యేక నిఘా : ఎస్పీ

ప్రజాశక్తి -అనంతపురం క్రైం

జిల్లాలో కోడిపందేలు, పేకాట, తదితర చట్ట వ్యతిరేక కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా వేశామని ఎస్పీ కెకెఎన్ అన్బురాజన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పోలీస్ ఆజ్ఞలను అతిక్రమించిన వారిపై కేసులు నమోదు చేసి, చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ముఖ్యంగా సంక్రాంతి పండుగను పురస్కరించుకుని కోడిపందేలు ఆడినా, ఆడుటకు బరులు (స్థలాలు) ఇచ్చినా, నిర్వహించినా, పాల్గొన్నా చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. గతంలో కోడిపందేలు నిర్వహించిన, ఆడిన వారిపై, కోడికత్తుల తయారీదారులపై బైండోవర్ కేసులు నమోదు చేశామని తెలిపారు. సంక్రాంతి పండుగను మంచి వాతావరణంలో, సంప్రదాయ పద్ధతిలో జరుపుకోవాలన్నారు. జిల్లాలో ఎక్కడైనా కోడిపందేలు ఆడినా, జూదం ఆడినా సంబంధిత పోలీస్‌స్టేషన్‌కుగానీ, తన నంబర్ 94407 96800, డయల్ 100, 112, స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో టోల్ ఫ్రీ నెంబర్ 14500కుగానీ ఫోన్ చేసి సమాచారం తెలియజేయాలని విజ్ఞప్తి చేశారు. సమాచారం అందించిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు.

ఉద్యోగ, ఉపాధ్యాయులకు బకాయిలు చెల్లించాలి

యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గోవిందరాజులు, లింగమయ్య

భోగి మంటల్లో ప్రజావ్యతిరేక విధానాల ప్రతులు వేసి నిరసన

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ఉద్యోగ, ఉపాధ్యాయులకు రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాల్సిన అన్నిరకాల బకాయిలను పూర్తిస్థాయిలో చెల్లించేంత వరకూ పోరాటం ఆగదని యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గోవిందరాజులు, లింగమయ్య హెచ్చరించారు. భోగి పండుగను పురస్కరించుకుని ఆదివారం నగరంలోని జిల్లా యుటిఎఫ్ కార్యాలయంలో ప్రభుత్వ అప్రజాస్వామిక, అహంకార పూరిత, నిరంకుశ వైఖరి ప్రతులను భోగిమంటల్లో వేసి దహనం చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయుల అండదండలతో అధికారంలోకొచ్చిన సిఎం జగన్ ఉద్యోగుల పట్ల అప్రజాస్వామికంగా, అహంకారపూరితంగా, నిరంకుశంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. నాలుగున్నరేళ్లలో ఉద్యోగులను అన్నిరకాలుగా వంచించారన్నారు. ఆఖరికి ఉద్యోగ, ఉపాధ్యాయులు తమ అవసరాల కోసం దాచుకున్న సొమ్ములను సైతం రాష్ట్ర ప్రభుత్వం దారి మళ్లించడం బాధాకరమన్నారు. ఉద్యోగులకు తెలియకుండా తమ సొమ్మును వాడుకునే హక్కు ప్రభుత్వానికి ఎవరిచ్చారని నిలదీశారు. ఉద్యోగులు తమ అవసరాల కోసం దాచుకున్న ప్రావిడెంట్ ఫండ్, ఏపీజిఎల్ఐ సొమ్ము నుంచి తమ పిల్లల చదువులు, వైద్య ఖర్చులు, గహ నిర్మాణాల ఖర్చుల కోసం దరఖాస్తు చేస్తే, రుణ చెల్లింపుల కోసం సంవత్సరాల తరబడి ఎదురు చూడాల్సి వస్తోందన్నారు. రాష్ట్ర కార్యదర్శి కోటేశ్వరప్ప మాట్లాడుతూ సిపిఎస్ ఉద్యోగుల ఖాతాలకు రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాల్సిన వాటా సుమారు రూ.2500 కోట్లు బకాయి ఉందన్నారు. వీటి చెల్లింపుల కోసం యుటిఎఫ్‌తో పాటు ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు ఉద్యమిస్తున్నా ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందని మండిపడ్డారు. బటన్ నొక్కుడు ద్వారా సంక్షేమ పథకాలను విజయవంతంగా అమలు చేస్తున్నామని పదేపదే ప్రకటించుకుంటున్న సిఎం జగన్ ఉద్యోగుల బకాయిల బటన్ ఎందుకు నొక్కడం లేదని నిలదీశారు. ఉద్యోగుల బకాయిల కోసం జనవరి 9, 10వ తేదీల్లో యుటిఎఫ్ ఆధ్వర్యంలో విజయవాడలో 36 గంటల దీక్షకు పిలుపునిస్తే ఉపాధ్యాయులను పోలీసులతో ఎక్కడికక్కడ నిర్బంధించి, అరెస్టులు చేయించడం విడ్డూరంగా ఉందన్నారు. ఆయా సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని, లేనిపక్షంలో తమ పోరాటం మరింత ఉధృతమవుతుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గౌరవాధ్యక్షులు రమణయ్య, సీనియర్ నాయకులు మహమ్మద్, జిలాన్, నాగేంద్ర, నారపరెడ్డి, నరసింహారెడ్డి, నాయకులు శేషప్ప, కొండప్ప, శ్రీనివాసులు, వెంకటనాయుడు, గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

రాయదుర్గం : ప్రభుత్వం విడుదల చేసిన జిపిఎస్ జీవో కాపీలను రాయదుర్గంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో భోగి మంటల్లో దహనం చేశారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ నాయకులు మాట్లాడుతూ ఆర్థిక బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.



ప్రజావ్యతిరేక విధానాల ప్రతులను భోగి మంటల్లో దహనం చేస్తున్న యుటిఎఫ్‌నాయకులు

ప్రభుత్వ వసతిగృహాలకు మహర్దశ

సాంఘిక సంక్షేమ శాఖ పీడీ శివరంగ ప్రసాద్

ప్రజాశక్తి పుట్టపర్తి రూరల్


శ్రీ సత్య సాయి జిల్లాలో ఉన్న 26 సాంఘిక సంక్షేమ హాస్టల్ల రూపురేఖలు త్వరలో మారనున్నాయని సాంఘిక సంక్షేమ శాఖ పీడీ శివ రంగ ప్రసాద్ పేర్కొన్నారు. ఆదివారం ఆయన ప్రజాశక్తి కిచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో పలు విషయాలను వెల్లడించారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వ పాఠశాలను నాడు నేడు కింద ఏ విధంగా అభివద్ధి చేశారో, అదేవిధంగా సాంఘిక సంక్షేమ హాస్టల్లోరూపురేఖలు మార్చనున్నారో తెలిపారు. విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పించడంతోపాటు ఇంటర్నెట్, కలర్ టీవీ ఏర్పాటు తదితర అంశాలపై అధికారులతో చర్చించి నిర్ణయాలు తీసుకుంటున్నామని వెల్లడించారు.

ప్రశ్న: శ్రీ సత్య సాయి జిల్లాలో ఎన్ని హాస్టల్లో ఉన్నాయి. వాటిలో ప్రీ మెట్రిక్ పోస్ట్ మెట్రిక్ హాస్టళ్లు ఎన్ని?

జవాబు : శ్రీ సత్య సాయి జిల్లా వ్యాప్తంగా 26 సాంఘిక సంక్షేమ హాస్టల్లో ఉన్నాయి. వాటిలో మూడు నుండి పదవ తరగతి విద్యార్థుల కోసం ఏర్పాటుచేసిన హాస్టళ్లు బాలురకు 12 బాలికలకు ఐదు ఉన్నాయి. పోస్ట్ మెట్రిక్ హాస్టళ్లు ఇంటర్మీడియట్ చదివే బాలికలకు ఐదు బాలురకు నాలుగు ఉన్నాయి.

ప్ర: విద్యార్థులకు కాస్మొటిక్ చార్జీలు సరిగా అందుతున్నాయా.?

జ : గతంలో మాదిరి కాకుండా విద్యార్థులకు నెలనెలా కాస్మొటిక్ చార్జీలను డిసెంబర్ వరకు వారి తల్లుల ఖాతాల్లో జమ చేశాం. మెస్‌చార్జీల విషయానికి వస్తే గతంలో ఉన్న చార్జీల కంటే ఇప్పుడు కొంత మేర పెంచాం. వాటివల్ల ప్రభుత్వం ఇచ్చిన మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నాం. భోజనం అందించే విషయంలో కొన్నిచోట్ల సమస్యలు మా దృష్టికి వచ్చాయి. ఆ సమస్యలు పరిష్కరించేందుకు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లాం. త్వరలో ప్రభుత్వం మెస్ చార్జీలను పెంచే ఆలోచనలో ఉంది.



ప్ర: హాస్టళ్లలో సిబ్బందికి బయోమెట్రిక్ విధానం అమలులో ఉందా?

జ : హాస్టళ్లలో సిబ్బంది బయోమెట్రిక్ విధానాన్ని అవలంభిస్తున్నారు. దాని ద్వారా ఏ అధికారి విధులకు హాజరు కాలేదో వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి వెళ్తుంది. ఈ తరుణంలో సిబ్బంది హాజరుపై సంజాయిషీ ఇవ్వాల్సి ఉంది. ఈ విధానంతో సిబ్బంది వందశాతం విధులకు హాజరవుతున్నారు.

ప్ర : అవుట్‌సోర్సింగ్ సిబ్బంది వేతనాలు ఎప్పుడు మంజూరు చేస్తారు.

జ : సాంఘిక సంక్షేమ హాస్టల్ పరిధిలో రెండు రకాల అవుట్‌సోర్సింగ్ఉద్యోగులు విధులు నిర్వర్తిస్తున్నారు. ఒకటి మూడు నుండి పదవ తరగతి వరకు ఉన్న అవుట్‌సోర్సింగ్ సిబ్బందికి ఆప్కాస్ నుండి నెలనెలా వేతనాలు అందుతున్నాయి. జూనియర్ కళాశాలలో పనిచేస్తున్న సిబ్బందికి నెల నెల వేతనాలు అందడం లేదు. వారికి మదర్‌థెరిసా ట్రస్ట్ నుండి వేతనాలు అందించాల్సి ఉంది. ప్రభుత్వం గ్రాంటు విడుదల చేస్తే మదర్‌థెరిసా ట్రస్ట్ కు బదలాయింపు చేసి వారికి వేతనాలను మంజూరు చేస్తారు.



ప్ర : హాస్టళ్ల అభివృద్ధికి తీసుకుంటున్న చర్యలేవి.?

జ : హాస్టళ్ల అభివృద్ధికి ప్రభుత్వం ఎన్నో చర్యలు చేపట్టింది. ప్రధానంగా అద్దె భవనాల్లో ఉన్న వసతి గృహాలపై దృష్టి పెట్టింది. నాడు నేడు కింద హాస్టళ్ల భవనాలు నిర్మించి హాస్టళ్లను ఉత్తమ స్థాయిలో తీర్చిదిద్దాలన్న దృక్పథంతో ప్రభుత్వం ఎన్నో కార్యక్రమాలు చేపడుతోంది. పిల్లల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి సౌకర్యవంతంగా హాస్టళ్లను ఏర్పాటు చేసి నాణ్యమైన విద్యను అందించనుంది.


ప్రజలకు కరపత్రాలు పంపిణీ చేస్తున్న పేదలకు పండుగను దూరం చేసిన జగన్

పేదలకు పండుగను దూరం చేసిన జగన్

టిడిపి ఇన్‌ఛార్జి బండారు శ్రావణిశ్రీ

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

పండుగ పూట పేదలు పస్తులు ఉండాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయని నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి బండారు శ్రావణిశ్రీ ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం మండల కేంద్రంలోని వీరభద్ర కాలనీలో 'బాబు షూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ' కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఇంటింటికి వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకోవడంతోపాటు ప్రభుత్వం వైఫల్యాలను వివరించారు. తర్వాత టిడిపి అధికారంలోకి వస్తే అమలు చేయనున్న పథకాల గురించి వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పేదలందరూ పండుగను సంతోషంగా జరుపుకోవాలని టిడిపి ప్రభుత్వ హయాంలో చంద్రన్న సంక్రాంతి కానుకలు ఇచ్చేవారన్నారు. అయితే వైసిపి అధికారంలోకి వచ్చాక కానుకలను రద్దు చేశారన్నారు. దీనికితోడు నిత్యావసర ధరలను విపరీతంగా పెంచడంతో పేదలు పండుగ పూట పస్తులుండాల్సిన పరిస్థితులు నెలకొన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వైసీపీ ప్రభుత్వ వైఫల్యం కారణంగా గ్యాస్ సిలిండర్ ధర పెరగడంతో కట్టెల పొయ్యిమీద వంటలు చేసుకుంటున్నారన్నారు. దీనికితోడు బస్సుఛార్జీలు, విద్యుత్ బిల్లులు, ఇంటి పన్నులు పెంచారన్నారు. ఇలాంటి సమయంలో రాష్ట్ర ప్రజలకు పట్టిన కీడు తొలగించేందుకు చంద్రబాబు సూపర్ సిక్స్‌ను మేనిఫెస్టోలో పెట్టారన్నారు. కావున రానున్న ఎన్నికల్లో టిడిపిని గెలిపించి చంద్రబాబును సిఎంను చేసుకుందామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు పసుపుల హనుమంతురెడ్డి, పి.రవీంద్ర, ఓబుళపతి, బాబా ఫక్రుద్దీన్, దండువారిపల్లి ఆదినారాయణ, నాయకులు, కార్యకర్తలు, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

మాజీ సైనికుల సమస్యలు పరిష్కరించాలి

మాజీ సైనికుల సంఘం జిల్లా అధ్యక్షులు షేకన్న

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ప్రభుత్వాలు మాజీ సైనికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని మాజీ సైనికుల సంఘం జిల్లా అధ్యక్షులు డి.షేకన్న డిమాండ్ చేశారు. వెటరన్స్ డే, జనవరి 15న ఇండియన్ ఆర్మీ డే ను పురస్కరించుకుని ఆదివారం నగరంలోని హెచ్ఎల్ఎన్ కాలనీలోని వికె.భవన్‌లో సమావేశం ఏర్పాటు చేశారు. ముందుగా అమరులైన సైనికులకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్లమెంట్‌లో ప్రకటించిన వన్ ర్యాంక్ వన్ పెన్షన్ విధానాన్ని అమలు చేయాలన్నారు. ఎంఎస్‌పిని ర్యాంకులతో సంబంధం లేకుండా అందరికీ సమానంగా ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం గౌరవాధ్యక్షులు వికె.రంగారెడ్డి, ప్రధాన కార్యదర్శి పట్నం ఉమామహేశ్వరరావు, ట్రెజరర్ టి.తిమ్మారెడ్డి, ఉపాధ్యక్షులు నాగిరెడ్డి రంగారెడ్డి, సభ్యులు నబీరసూల్, వై.ప్రసాద్, సిద్దన్న, సంజీవకుమార్, రవికుమార్, నాగరాజు, శివశంకర్, మహబూబ్‌పీరా, నర్సింహులు, బి.ఎ.హుస్సేన్, అబ్దుల్‌ఖాదర్, ఖాజామొయిద్దీన్, ఇర్షాద్‌అహ్మద్, పి.బాబా, హుస్సేన్‌బాషా, అల్లాబక్షు, రామాంజనేయులు, మహమ్మద్ ఇషాక్, బుక్కపట్నం కుమార్, మహిళా సభ్యులు పద్మావతి, తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో పాల్గొన్న మాజీ సైనికులు



ప్రతిజ్ఞ చేస్తున్న నెహ్రూ యువకేంద్రం ఎస్ఆర్, ప్రగతి పథం సభ్యులు

రోడ్డు నిబంధనలు పాటిద్దాం

ప్రజాశక్తి-అనంతపురం

ప్రతి ఒక్కరూ రోడ్డు నిబంధనలను పాటించి రోడ్డు ప్రమాదాలను అరికడదామని ఎస్ఆర్ ఎడ్యుకేషనల్ వ్యవస్థాపక అధ్యక్షులు, అర్బన్ బ్యాంకు డైరెక్టర్ సుంకర రమేష్ పిలుపునిచ్చారు. జాతీయ రహదారి భద్రతా వారోత్సవాల్లో భాగంగా నెహ్రూ యువ కేంద్రం, ఎస్ఆర్ ఎడ్యుకేషనల్ సొసైటీ, ప్రగతి పథం యూత్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం నగరంలోని టవర్ క్లాక్ సర్కిల్‌లో ట్రాఫిక్ కానిస్టేబుళ్లను సత్కరించారు. అనంతరం రోడ్డు నిబంధనలు పాటిద్దామని ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనదారులు రోడ్డుపై ప్రయాణించేటప్పుడు వేగాన్ని నిరోధించుకోవాలన్నారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. ద్విచక్రవాహల్లో వెళ్లేటప్పుడు హెల్మెట్‌ను తప్పనిసరిగా ధరించాలన్నారు. కారులో సీటు బెల్టును ధరించాలన్నారు. ప్రతి ఒక్కరూ డ్రైవింగ్ లైసెన్స్‌ను విధిగా పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఆర్ ఎడ్యుకేషన్ సొసైటీ కార్యదర్శి కీర్తి, రాజేశ్వరి, అర్ఫిన్, ప్రగతి పథం యూత్ అసోసియేషన్ కార్యదర్శి తుకారం గణేష్, జాతీయ యువ కార్యకర్తలు వెంకటేష్, సాయి, రూబీ, తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

విద్యుదాఘాతంతో పంచాయతీ కార్యదర్శి మృతి


మృతిచెందిన ప్రశాంతి (పాతచిత్రం)

కళ్యాణదుర్గం : కంబదూరు మండల పరిధిలోని కొత్త పార్శ్వపల్లి గ్రామంలో పంచాయతీ కార్యదర్శి ప్రశాంతి ఆదివారం విద్యుదాఘాతంతో మృతిచెందింది. వివరాల మేరకు.. ఇంట్లో నీరు రాకపోవడంతో విద్యుత్ మోటార్‌ను ఆన్ చేయగా విద్యుత్‌షాక్ తగిలింది. దీంతో ఒక్కసారిగా విద్యుత్ విసిరి కొట్టడంతో నీటి తొట్టెకు తల తగిలింది. తీవ్రంగా గాయపడి అపస్మారక స్థితిలోకి వెళ్లిన ప్రశాంతిని కుటుంబ సభ్యులు వెంటనే కళ్యాణదుర్గం ప్రభుత్వాసపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతిచెందింది. ప్రశాంతి కంబదూరు మండలం ఓబిగానపల్లి గ్రామ సచివాలయంలో పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తోంది. ఈమేరకు కంబదూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కర్నాటక మద్యం పట్టివేత

అనంతపురం క్రైం : ఎస్పీ కెకెఎన్ అన్బురాజన్ ఆదేశాల మేరకు డి.హీరేహాళ్ ఎస్ఐ రంగడుయాదవ్ ఆధ్వర్యంలో పోలీసులు, చెక్ పోస్ట్ సిబ్బంది కర్ణాటక మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. మండలంలోని హులికల్లు చెక్‌పోస్టు వద్ద ఆంధ్రకు తీసుకొస్తున్న 192 కర్నాటక టెట్రా పాకెట్లతోపాటు ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు.


డి.హీరేహాళ్‌లో పట్టుబడిన మద్యం వివరాలను వెల్లడిస్తున్న పోలీసులు

పుట్లూరు : మండల పరిధిలోని కడవకల్లులో మద్యం విక్రయిస్తున్న శ్రీనివాసులును అరెస్టు చేసి మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ దిలీప్‌కుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు పక్కాగా అందిన సమాచారం మేరకు నిందితుడిని అదుపులోకి తీసుకోవంతోపాటు 15 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ యజమానికి జరిమానా

రాయదుర్గం : రంగచేడు నుంచి రాయదుర్గానికి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌కు జరిమానా విధించినట్లు సెబ్ అధికారులు తెలిపారు. అనుమతి లేకుండా అక్రమంగా ఇసుక రవాణా చేస్తుండగా ట్రాక్టర్ యజమాని కోనాపురం చెందిన బాలారెడ్డికి రూ.10వేలు జరిమానా విధించినట్లు తెలిపారు.

జూదరుల అరెస్టు

గుత్తి : మండలంలోని అబ్బేదొడ్డి గ్రామంలో ఆదివారం పేకాట జూదరులను పోలీసులు అరెస్టు చేశారు. గ్రామ శివారులోని ముళ్లపొల్లో ఉన్న పేకాట స్థావరంపై ఎస్ఐ బి.నబిరసూల్ ఆధ్వర్యంలో దాడి చేసి 9 మంది జూదరులను అరెస్టు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. నిందితుల నుంచి రూ.10,100 నగదు, పేకముక్కలను స్వాధీనం చేసుకుని సీజ్ చేసినట్లు తెలిపారు.

ప్రజలకు అందుబాటులో ఉంటా : ఎమ్మెల్యే కాపు

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డి

నియోజకవర్గ ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని రాయదుర్గం ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డి తెలిపారు. ఆదివారం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బాలా నరేంద్రబాబు వ్యవసాయ తోటలో ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళ్యాణదుర్గం ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ అన్నిరకాలుగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తాన్నారు. గతంలో కూడా కళ్యాణదుర్గం ప్రాంతం అభివృద్ధిలో తనవంతు పాత్రను పోషించానని గుర్తు చేశారు. రానున్న రోజుల్లో తన రాజకీయ ప్రస్తానం కూడా కళ్యాణదుర్గం నుంచి ప్రారంభిస్తామన్నారు. అనంతరం బ్రహ్మసముద్రం సీనియర్ నాయకులు ప్రభావతమ్మ పుట్టిన రోజు సందర్భంగా కేక్ కోసి పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల నుంచి వచ్చిన నాయకులు పాల్గొన్నారు.

తెలుగుదేశం పార్టీతోనే బీసీల ప్రగతి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

17న జయహో బీసీ సదస్సు మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్‌చౌదరి


జయహో బీసీ సదస్సు పోస్టర్లను విడుదల చేస్తున్న టిడిపి నాయకులు

తెలుగుదేశం పార్టీతోనే బీసీల ప్రగతి సాధ్యమని మాజీ ఎమ్మెల్యే వైకుంఠం ప్రభాకర్‌చౌదరి అన్నారు. ఆదివారం అనంతపురం అర్బన్ పార్టీ కార్యాలయంలో పార్టీ శ్రేణులతో కలిసి జయహో బిసి కరపత్రాలను విడుదల చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 17న నగరంలోని 5వ రోడ్డులో ఉన్న సాయిబాబా గుడి దగ్గర నిర్వహించనున్న జయహో బిసి సభను మహిళలు, అనుబంధ సంఘాల నాయకులు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. పార్టీ మేనిఫెస్టో భవిష్యత్తుకు గ్యారెంటీలో భాగంగా దేశంలోనే మొదటిసారిగా బీసీల రక్షణ చట్టం తీసుకొస్తామని టిడిపి హామీ ఇచ్చిందన్నారు. బీసీలకు ఎప్పుడూ ఎన్టీఆర్‌తోపాటు చంద్రబాబు వెన్నుదన్నుగా నిలిచారని గుర్తు చేశారు. గత ప్రభుత్వంలో బీసీల కోసం అనేక పథకాలు చేపట్టారన్నారు. కావున వచ్చే ఎన్నికల్లో బీసీలంతా ఏకమై టిడిపికి అండగా నిలవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు దాసరి శ్రీధర్, నారాయణస్వామి యాదవ్, దేవల్ల మురళి, సిమెంట్ పోలన్న, మారుతీకుమార్‌గౌడ్, పోతుల లక్ష్మీనరసింహులు, కుంచేపు వెంకటేష్, గోపాల్ గౌడ్, జెఎం.బాషా, కడియాల కొండన్న, మల్లికార్జున, పుల్లన్న, మురళి, చెరుకూరి సుధాకర్, సూరి, తదితరులు పాల్గొన్నారు.

పార్టీ ఆదేశాలకు కట్టుబడి పనిచేస్తా

ప్రజాశక్తి-గుంతకల్లు

జనసేన నాయకులు బిఆర్.నాయుడు


జనసేన పార్టీలో చేరుతున్న పారిశ్రామికవేత్త బిఆర్.నాయుడు

జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ ఏం ఆదేశించినా ఆయన ఆశయాలకు అనుగుణంగా పని చేస్తానని ప్రముఖ వ్యాపారవేత్త, యువనేత బాల్యం రంగనాయకులునాయుడు (బిఆర్.నాయుడు) అన్నారు. ఆదివారం పట్టణంలోని స్వగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ ఆశయాలు, భావజాలం, సిద్ధాంతాలు, పోరాట పటిమకు ఆకర్షితుడనై ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆమంచి స్వాములు ఆధ్వర్యంలో మంగళగిరిలోని రాష్ట్ర పార్టీ కార్యాలయంలో పిఎసి ఛైర్మన్ నాదెండ్ల మనోహర్ సమక్షంలో జనసేనలో చేరినట్లు తెలిపారు. పదేళ్లుగా పవన్‌కళ్యాణ్ చేస్తున్న పోరాట పటిమను స్ఫూర్తిగా తీసుకుని జన సైనికుడిగా పార్టీ కోసం పని చేస్తానన్నారు. ముఖ్యంగా నియోజకవర్గంలో బిసి సామాజికవర్గం (బోయ) బలంగా ఉందన్నారు. వీరందరూ పవన్ కళ్యాణ్ స్థాపించిన జనసేన పార్టీపై ఎంతో మక్కువతో ఉన్నారన్నారు. జనసేన అధిష్టానం తనకు ఎలాంటి ఆదేశాలు ఇచ్చినా కట్టుబడి పని చేస్తానన్నారు. జిల్లాలోని గ్రామస్థాయిలో జనసేన బలోపేతం కోసం సైనికుడిలా పనిచేస్తానన్నారు. ముఖ్యంగా వైసిపి పాలనపై ప్రజలు తీవ్ర అసంతృప్తితో ఉన్నారన్నారు. మార్పు కోసం ప్రజలు ఎదురు చూస్తున్నారని, త్వరలో జరుగనున్న సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు జనసేన, టిడిపి కూటమికి అధికారం అందించేందుకు సిద్ధంగా ఉన్నారని ధీమా వ్యక్తం చేశారు.


మెట్టు గోవిందరెడ్డిని గజమాలతో సత్కరిస్తున్న వైసిపి నాయకులు

'మెట్టు'ను కలిసిన వైసిపి నాయకులు

డి.హీరేహాల్ : రాయదుర్గంలోని వైసిపి సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి స్వగృహంలో మండలానికి చెందిన పలువురు వైసిపి నాయకులు ఆదివారం కలిశారు. ఈ సందర్భంగా వైసిపి సమన్వయకర్తగా నియమితులైనందుకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి మైనార్టీ నాయకులు రహంతుల్లా, మార్కెట్ యార్డు డైరెక్టర్ హనుమంతురెడ్డి, సీనియర్ నాయకులు జగదీష్, సర్పంచి హరిజన లక్ష్మి, నాయకులు శివారెడ్డి, ఉలెప్పరెడ్డి, నాగరాజురెడ్డి, తిమ్మారెడ్డి, బోయ నాగ, వంద్రప్ప, గన్ని గౌడ, ఖాసీంపీరా, గవి సిద్ధ, తదితరులు పాల్గొన్నారు.

భూహక్కు చట్టాన్ని రద్దు చేయాలి

జీవో ప్రతులు భోగి మంటల్లో వేసి దహనం

ప్రజాశక్తి-పుట్లూరు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకొచ్చిన దుర్మార్గమైన భూహక్కు చట్టాన్ని రద్దు చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు ఆదివారం భోగి పండుగను పురస్కరించుకుని భోగి మంటల్లో జీవో కాపీలను వేసి దహనం చేశారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం నాయకులు మాట్లాడుతూ ప్రపంచ బ్యాంకు నిర్ణయం మేరకు కేంద్ర ప్రభుత్వం నియమించిన నీతి అయోగ్ ఆదేశాలకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం భూ హక్కు చట్టాన్ని తీసుకొచ్చిందన్నారు. ఈ చట్టం రద్దు చేయాలని కోరుతూ న్యాయ నిపుణులు, వివిధ రైతు సంఘాలు ఆందోళనలు చేస్తే హైకోర్టు తాత్కాలిక స్టే విధించిందన్నారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే స్పందించి రైతాంగానికి కీడు కలిగించే అత్యంత దుర్మార్గమైన చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎపి రైతుసంఘం మండల గౌరవాధ్యక్షులు టి.బాలగుర్రయ్య, మండల కార్యదర్శి సత్తార్ గోపాల్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ ఎ.చిన్నకుళ్లాయప్ప, మండల ఉపాధ్యక్షుడు గోపాలకృష్ణ, చిన్న కృష్ణుడు, మండల నాయకులు వి.వెంకటశేఖర్, టి.వీరయ్య, ప్రతాప్, సురేష్, రైతులు గోపాల్, రాజా, నాగసుబ్బరాయుడు, రాము, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా భోగి వేడుకలు


భోగి మంటలు వేసిన మహిళలు

పుట్లూరు : మండలంలో ఆదివారం భోగి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా మహిళలు పెద్దఎత్తున భోగి మంటలు వేసి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా భోగి మంటల వద్ద పాటల పాడుతూ.. నృత్యం చేస్తూ భోగి వేడుకలను నిర్వహించారు.

రాయదుర్గం : రాయదుర్గంలోని వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి స్వగృహంలో ఆదివారం భోగి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా భోగి మంటలు వేసి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా నియోజకవర్గ ప్రజలకు భోగి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాయదుర్గం యువనేత మెట్టు విశ్వనాథ్‌రెడ్డి దంపతులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

హెల్పింగ్ హ్యాండ్స్ సాయం

రాయదుర్గం : ఇస్తేమాకు హెల్పింగ్ హ్యాండ్స్ ఫ్రెండ్స్ గ్రూప్ తరపున బస్సుల సౌకర్యం ఏర్పాటు. ఏడాది కోసారి ఇస్తేమాలు జరుగుతాయి. ఇందులో భాగంగానే ఈ ఏడాది బళ్లారిలోని ఈద్గా మైదానంలో తలపెట్టారు. దీంతో నేడు, రేపు ఇస్తేమా జరగనుంది. ఇందులో వేలాది ముస్లింలు పాల్గొంటారు. సోమవారం తిరుగు ప్రయాణంలో రాత్రి జనాలు ఇబ్బంది పడతారని దృష్టిలో ఉంచుకుని భక్తుల సౌకర్యార్థం రాయదుర్గం పట్టణంలోని హెల్పింగ్ హాండ్స్ ఫ్రెండ్స్ గ్రూప్ తరపున రెండు బస్సులు ఆదివారం, సోమవారం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో హెల్పింగ్ హ్యాండ్ ఫ్రెండ్స్ గ్రూప్ సభ్యులు అబూబక్కర్, ఇనాయత్, మొహమ్మద్ రఫీక్, అమాన్, హఫీజ్ ఉల్లాఖాన్, కరీం, ఫైరోజ్, మక్కా మసీద్ యూత్ ఆర్గనైజేషన్ సభ్యులు పాల్గొన్నారు.

టిడిపితోనే ఎస్సీ, ఎస్టీల ఆర్థికాభివృద్ధి

జిల్లా ఎస్సీ సెల్ అధికార ప్రతినిధి నల్లబోతుల శ్రీనివాసులు

ప్రజాశక్తి-పామిడి

తెలుగుదేశం పార్టీతోనే ఎస్సీ, ఎస్టీల ఆర్థికాభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ జిల్లా ఎస్సీ సెల్ అధికార ప్రతినిధి నల్లబోతుల శ్రీనివాసులు ఆదివారం ఒక ప్రకటనలో అన్నారు. టిడిపి హయాంలో చంద్రబాబు అమలు చేసిన ఎస్సీ, ఎస్టీలకు సంబంధించిన 27 సంక్షేమ పథకాలను వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రద్దు చేసిందన్నారు. నాడు చంద్రబాబు అమలుపరిచిన ఎస్సీ, ఎస్టీ కార్పొరేషన్ల బ్యాంకు లింక్‌లోన్లు, వేల కోట్ల సబ్‌ప్లాన్ నిధులు, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విదేశీ విద్యాస్కీమ్ వంటి ఎన్నో సంక్షేమ పథకాలను జగన్ తుంగలో తొక్కారని గుర్తు చేశారు. అంతేగాకుండా దళిత మహానుభావుడైన డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ రాసిన రాజ్యాంగం, హక్కులకు విలువ లేకుండా చేసి తన సొంత రాజారెడ్డి రాజ్యాంగాన్ని అమలు చేస్తూ దళిత హక్కులను కాలరాస్తున్నాడన్నారు. రాష్ట్రంలో దళితులపై దాడులు ఎక్కువయ్యాయన్నారు. ఇందుకు దళిత డ్రైవర్ సుబ్రమణ్యంను హత్య చేసి డోర్ డెలివరీ చేసిన ఘటనే ఇందుకు నిదర్శనం అన్నారు. అది కూడా ఓ వైసిపి ఎమ్మెల్సీ చేయడం బాధాకరమన్నారు. అదేవిధంగా మాస్కులు అడిగిన పాపానికి దళిత డాక్టర్ సుధాకర్‌పై విచక్షణ రహితంగా దాడి చేసి అతని చావుకు కారణమయ్యారన్నారు. జగన్ ప్రభుత్వం చేస్తున్న అన్యాయాలను ప్రశ్నిస్తే అక్రమ కేసులు, ఉద్యమిస్తే సంకెళ్లు, ఆడవారిపై అఘాయిత్యాలు, శిరోముండనాలు, దాడులు చేస్తారన్నారు. ఇవన్నీ దళితులు గమనిస్తున్నారని, త్వరలోనే జగన్‌ను ఇంటికి సాగనంపుతామన్నారు.

ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు : ఎస్పీ

అనంతపురం క్రైం : సంక్రాంతి పండుగ పురస్కరించుకుని ప్రజలకు ఎస్పీ కెకెఎన్ అన్బురాజన్ ఆదివారం శుభాకాంక్షలు తెలిపారు. ఇంటిల్లిపాది సంతోషంగా సంక్రాంతి పండుగను నిర్వహించుకోవాలని ఆకాంక్షించారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాల జోలికెళ్లకుండా భోగి, మకర సంక్రాంతి, కనుమలను ఆనందంగా జరుపుకోవాలని కోరారు.

గోదాదేవి కళ్యాణం

రాయదుర్గం : పట్టణంలోని కోటలో వెలసిన ప్రసన్న వెంకటరమణ స్వామి ఆలయంలో ఆదివారం గోదాదేవి రంగనాథస్వామి కళ్యాణోత్సవం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా ప్రసన్న వెంకటరమణ స్వామి మూలవిరాట్‌ను పూలు, ఆభరణాలతో ప్రత్యేకంగా అలంకరించారు. తర్వాత పూజలు చేశారు. అనంతరం కళ్యాణ మండపంలో గోదాదేవి రంగనాథ స్వామిమూర్తులకు అర్చకులు, పురోహితులు శాస్త్రోక్తంగా కళ్యాణం జరిపించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి, రాయదుర్గం పురపాలక సంఘం మాజీ అధ్యక్షులు గౌని ఉపేంద్రరెడ్డి, ఆలయ కమిటీ అధ్యక్షులు గౌని పాలాక్షిరెడ్డి, పాలకమండలి సభ్యులు కోడూరు లక్ష్మి, నాయకులు పోరాళు శివ, పాలక మండలి సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

బాధితులకు ఆర్థికసాయం

గుత్తి : ప్రభుత్వం నుంచి మంజూరైన ఆర్థికసాయాన్ని ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి లబ్ధిదారులకు ఆదివారం పంపిణీ చేశారు. మండలంలోని అబ్బేదొడ్డి గ్రామానికి చెందిన గోవిందమ్మకు రూ.60వేలు, సంజీవరెడ్డికి రూ.25వేలు సిఎం సహాయ నిధి కింద ఆర్థికసాయం మంజూరైంది. దీంతో ఎమ్మెల్యే వైవిఆర్ క్యాంపు కార్యాలయంలో ఆర్థికసాయం చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో వైసీపీ నాయకుడు మెట్టు లక్ష్మీకాంతరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


ఆర్థికసాయం చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి

రాష్ట్రంలో 'చీకటి' తొలగాలి

టిడిపి ఆధ్వర్యంలో సమస్యల ప్రతులు భోగి మంటల్లో వేసి నిరసన

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక చీకటి జీవోలను తీసుకొచ్చి ప్రజలకు చీకట్లోకి నెట్టారని, వచ్చే నూతన సంవత్సరంలో చీకట్లు తొలగి, వెలుగులు రావాలని మాజీ ఎమ్మెల్యే వైకుంఠం ప్రభాకర్‌చౌదరి అన్నారు. ఆదివారం అనంతపురం అర్బన్ కార్యాలయం ఎదుట 'కీడు తొలగాలి.. ఎపి వెలగాలి' అంటూ రాష్ట్ర సమస్యల ఫొటోల ప్రతులను భోగిమంటల్లో వేసి దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరంకుశ పాలనలో, నియంత ఏలుబడిలో, అప్రకటిత ప్రజాస్వామ్యంతో రాష్ట్రంలో చీకటి రోజులు కమ్ముకున్నాయన్నారు. ప్రజా వ్యతిరేక విధానాలతో ప్రతిపక్షాల ఉనికి లేకుండా, పౌరుల స్వేచ్ఛను హరింపజేసే సిఎం జగన్ పాలన సాగిస్తున్నారన్నారు. సిఎం జగన్ తాను చెప్పిందే శాసనం, వేదమని అనే విధానాలతో ముందుకెళ్లడం బాధాకరమన్నారు. ఆఖరికి కోర్టులు సైతం చీవాట్లు పెట్టి చీకటి జీవోలు తప్పు అని చెప్పినప్పటికీ పోలీసు యంత్రాంగం ద్వారా తనకు ఇష్టం వచ్చే రీతిలో వ్యవహరించడం ప్రజాస్వామ్యాన్ని కూనీ చేయడమే అన్నారు. వచ్చే ఎన్నికల్లో వైసీపీకి బుద్ధి చెప్పి, టిడిపి అత్యధిక మెజారిటీతో గెలిపించి చంద్రబాబును సిఎంను చేసుకుందామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు దేవల్ల మురళి, నారాయణస్వామియాదవ్, సరిపూటి రమణ, వన్నూరప్ప, పోతుల లక్ష్మీనరసింహులు, కుంచపు వెంకటేష్, ముక్తియార్, నటేష్‌చౌదరి, లక్ష్మీప్రసాద్, గోపాల్‌గౌడ్, రాజారావు, అజీజ్, టైలర్ సీనా, పావురాల శేఖర్, గుర్రం నాగభూషణ, సద్దాంహుస్సేన్, అంజి, మురళి, తెలుగు మహిళలు విజయశ్రీ రెడ్డి, రాములమ్మ, వసుంధర, తదితరులు పాల్గొన్నారు.

నార్పల : వైసిపి ప్రజా వ్యతిరేక నిర్ణయాలను నిరసిస్తూ, రాష్ట్రానికి పట్టిన కీడు తొలగాలని టిడిపి నాయకులు ఆకాంక్షించారు. భోగి పండుగను పురస్కరించుకుని ఆదివారం మండల కేంద్రంలోని టిడిపి కార్యాలయం ముందు వివిధ సమస్యలను సంబంధించిన కరపత్రాలను భోగి మంటల్లో వేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా టిడిపి నాయకులు మాట్లాడుతూ అధిక పన్నులు, కరెంట్ బిల్లుల బాదుడే బాదుడు, రోడ్లపై గుంతలు, జాబ్ క్యాలెండర్ ప్రకటించకపోవడం, ప్రజలు, మహిళలు, యువత, రైతులను నట్టేట ముంచారని ఆరోపించారు. కనీసం రోడ్డుపై గుంతలు పూడ్చలేని పరిస్థితుల్లో ప్రభుత్వం ఉండటం బాధాకరమన్నారు. వచ్చే సంవత్సరం అయినా సైకో పాలన పోయి ప్రజా పాలన రావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఆలం


నార్పలలో భోగి మంటల్లో ప్రతులను వేసి నిరసన తెలుపుతున్న టిడిపి నాయకులు


చీకటి జీవో ప్రతులను భోగి మంటల్లో వేసి నిరసన తెలుపుతున్న బండారు శ్రావణిశ్రీ

నాగార్జుననాయుడు, పిట్టు రంగారెడ్డి, ఎర్రినాగప్ప, చంద్రబాబు, లక్ష్మీనారాయణ, తలారి కుళ్లాయప్ప, జాఫర్, రాజన్న, నారాయణస్వామి, మల్లిరెడ్డి, వెంగల్‌రెడ్డి, రామానాయుడు, గంగాధర్‌నాయుడు, సత్తయ్య, నాగేష్, భూషణ, బాబుప్రసాద్, ఓబిలేసు, రాజేష్, వెంకటరమణ, అంకన్న, దేవేంద్ర, జాఫర్‌వలి, తలారి నాగేష్, రామాంజి, మాధవయ్య, గంగాధర్, హరి, టిడిపి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు

శింగనమల : రాష్ట్ర టిడిపి పిలుపు మేరకు భోగి పండుగ సందర్భంగా వైసిపి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక నిర్ణయాలను నిరసిస్తూ రాష్ట్రానికి పట్టిన కీడు తొలగాలని కోరుతూ నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి బండారు శ్రావణిశ్రీ ఆధ్వర్యంలో ఆదివారం నగరంలోని స్వగృహం వద్ద భోగి మంటల్లో ప్రతులను వేసి నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పిటిసి అమ్మలదిన్నె శాలిని, టిడిపి మాజీ మండల కన్వీనర్ చితంబరి దొర, నాయకులు గుర్రం లక్ష్మీనారాయణ, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

రాయదుర్గం : 'కీడు తొలగాలి-ఏపీ వెలగాలి' కార్యక్రమంలో భాగంగా గుమ్మఘట్ట మండలం పూలకుంట గ్రామంలో టిడిపి నాయకులు అక్రమ కేసుల ఎఫ్ఐఆర్ ప్రతులను భోగి మంటల్లో వేసి నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బీమా సొమ్ము పంపిణీ


ఆర్థికసాయం అందజేస్తున్న నాయకులు

గుత్తి : ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన పట్టణంలోని కర్నూలు రోడ్డులో నివాసం ఉండే రాజమడుగు చంద్రావతి కుటుంబ సభ్యలకు అత్యవసర సాయం కింద రూ.10వేలను అందజేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ ఎం.సులోచన, సచివాలయాల కన్వీనర్ ఎం.రంగస్వామి, సచివాలయ సంక్షేమ కార్యదర్శి గంగాధర్, వాలంటరీ మంజుల, తదితరులు పాల్గొన్నారు.

బహుమతులు ప్రదానం

బుక్కరాయసముద్రం : ఎంప్లాయీస్ ఎంప్లాయిస్ రిక్రియేషన్ క్లబ్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ముగ్గుల పోటీల విజేతలకు ఆదివారం బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో పిఆర్ డీఈ గుర్రాజరావు, సర్పంచి పార్వతి, సూర్య నారాయణ రావు, శివకుమార్, సత్య నారాయణ, మాజీ సర్పంచి లక్ష్మీనారాయణ, నాయకులు పూల నారాయణస్వామి, కేసన్న, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.


బహుమతులు ప్రదానం చేస్తున్న అతిథులు